క్లుప్తంగా

మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మద్దిపాడు: మండల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుంటూరు నుంచి ఒంగోలు వస్తూ స్టేషన్ వద్ద ఆగి పరిసరాలను పరిశీలించారు. ఎస్పీ వచ్చిన విషయం తెలుసుకున్న ఎస్సై.. వెంటనే స్టేషన్‌కు వచ్చే క్రమంలో త్వరలో ఇన్‌స్పెక్షన్‌కు వస్తానని ఎస్పీ తెలియజేసి వెంటనే ఒంగోలు వెళ్లిపోయారు.

ఉపాధి కూలీలకు తక్షణమే వేతనమివ్వాలని ధర్నా


ఉపాధి కూలీల అర్జీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీహరి

మద్దిపాడు: ఉపాధి కూలీలకు రెండు నెలలుగా జీతాలు నిలిపివేశారని, తక్షణమే ఆ నిధులు విడుదల చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు ధర్నా చేశారు. సీపీఎం మండల నాయకుడు ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీల డబ్బు నిలిపివేయడం దారుణమని, ప్రభుత్వం వెంటనే వారి ఉపాధి కూలి డబ్బును వారి ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి ఎంపీడీఓ శ్రీహరికి అర్జీ అందజేశారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న మేట్లు, ప్రజాసంఘాల నాయకులు

నాగులుప్పలపాడు: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘం నాయకులు పున్నయ్య, సత్యనారాయణ, సంజీవ డిమాండ్ చేశారు. వేతన బకాయిలు విడుదల చేయాలని, ఉపాధి హామీ పనులు పునరుద్ధరించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని సంఘం నాయకులు ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీలు చేసే పనికి 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలని ఉపాధి చట్టం చెబుతోందని, కానీ గత రెండు నెలలుగా వేతనాలు అందించకుండా కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి ఇప్పటి వరకు ఆలస్యానికి వడ్డీతో కలిపి కూలీలకు వేతనాలు ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పునకు లోబడి పనిచేయాలన్నారు. వ్యవసాయ పనులు లేనందున గ్రామీణ పేదలకు పెద్ద ఆసరాగా ఉన్న ఉపాధి పనులు ప్రస్తుతం లేనందున గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నాగులుప్పలపాడు: ప్రతి వాహనదారుడు మోటారు వెహికల్ చట్టం నిబంధనలు పాటించాలని నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. సోమవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాల నంబర్ ప్లేట్లపై నంబరు తప్ప ఏ ఇతర గుర్తులు ఉండరాదన్నారు. అలా ఎవరైనా వాహనాలకు పెడితే ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమగ్ర సప్తాహ్ ప్రారంభం

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం రవికుమార్ అధ్యక్షతన సోమవారం సమగ్ర సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ కిషోర్‌బాబు పాల్గొని మాట్లాడారు. సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

ఒంగోలు టౌన్: దేశంలోని ప్రజలంతా సుఖశాంతులతో, శాంతిసామరస్యాలతో జీవించేలా క్రైస్తవులంతా ప్రార్థన చేయాలని ఒంగోలు టౌన్ డినామినేషన్ చర్చస్ యూనియన్ ప్రెసిడెంట్ పాస్టర్ ఐజాక్‌బాబు, కార్యదర్శి పాస్టర్ భగవాన్ దాస్ పిలుపునిచ్చారు. స్థానిక సుజాతనగర్‌లోని షకేను ప్రార్థనా మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి నగరంలోని చర్చిలకు చెందిన 150 మంది సంఘ కాపరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ దైవ సందేశం అందేలా సంఘకాపరులు కృషి చేయాలని సూచించారు. టౌన్ డినామినేషన్ చర్చస్ యూనియన్ బలోపేతానికి ప్రతిఒక్కరూ బాధ్యతగా ప్రయత్నించాలని చెప్పారు. సమావేశంలో సంఘ పెద్దలు యోబు, జకర్యా, కృపారావు, డేవిడ్, శ్రీనివాసరావు, రమణ, రవికుమార్, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలు నగరం


చీమకుర్తి పట్టణం


రామతీర్థం రిజర్వాయర్

అధ్యక్షా.. సమస్యలపై స్పందిస్తారా..!

- ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు గళం వినిపించాలంటున్న ప్రజలు
- ఒంగోలు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై ఎన్నో ఆశలు
- విమర్శలతో సరిపెడతారా.. అర్థవంతంగా చర్చిస్తారా..? అంటూ ప్రశ్నలు
- ఒంగోలు నియోజకవర్గంలో అనేక పెండింగ్ పనులు

ఒంగోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీ సమావేశాలు మొదలవడంతో.. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గంలోని సమస్యలపై స్పందించి పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా అమలు చేసేలా అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు గళం వినిపించాలంటున్నారు. విమర్శలతో సరిపెట్టకుండా అర్థవంతంగా చర్చించాలంటున్నారు. ఒంగోలు నియోజకవర్గానికి స్థానిక ఎమ్మెల్యే అధికంగా నిధులు రాబట్టాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో సమస్యలివీ...

పోతురాజు కాలువ ఆధునికీకరణ

ఒంగోలు నగరంలోని ప్రధాన డ్రైనేజీ కాలువ అయిన పోతురాజుకాలువ ఆధునికీకరణ ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర విభజన అనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌రావు హయాంలో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా పోతురాజు కాలువను నిర్లక్ష్యం చేశారు. ఈసారైనా వారి హయాంలో ఈ సమస్యను పరిష్కరించాలనే డిమాండ్ వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దాదాపు 30 శాతం వరకు పనులు పూర్తి చేయించారు.

టిడ్కో ఇళ్లు.. ఇంటి పట్టాలు...

నగరంలో టిడ్కో ఇళ్ల ప్రాజెక్టులు రెండు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలి. ఇవేకాకుండా కొప్పోలు, వెంగముక్కలపాలెం వద్ద జగనన్న కాలనీల్లో ఇంటి స్థల పట్టాల పంపిణీకి గత ప్రభుత్వం రూ.230 కోట్లు వెచ్చించి భూములు కొనుగోలు చేసి పట్టాలు పంపిణీ చేసింది. వాటిలో ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు...

నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల హామీలో కూటమి పార్టీలు చెప్పాయి. అందుకు అవసరమైన నిధులు విడుదల చేయించాల్సి ఉంది. అందుకోసం అసెంబ్లీలో ఎమ్మెల్యే గళం విప్పాల్సి ఉంది. తాగునీటి ఎద్దడి నివారణకు సంతనూతలపాడు, కొప్పోలు చెరువుల ఆక్రమణలు తొలగించి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా మార్చాల్సి ఉంది.


పోతురాజుకాలువ

ఫిషింగ్ హార్బర్...

కొత్తపట్నం మండలం పిన్నింటివారిపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. రూ.400 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తిచేసే బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఉంది.

రెండో ఆర్టీసీ డిపో, మరెన్నో సమస్యలు...

పెరిగిన జనాభా, ప్రయాణికులకు అనుగుణంగా ఒంగోలులో రెండో ఆర్టీసీ డిపో ఆవశ్యకత ఉంది. నగరంలో ఉన్న డిపోను సిటీ బస్సుల కోసం, రెండో డిపోను ఎక్స్‌ప్రెస్ డిపోగా మారిస్తే నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కూడా జరుగుతుంది. ఇంకా బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జికి రూ.50 లక్షలు, సంకువానిగుంట మార్గంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, సూరారెడ్డిపాలెం నుంచి ఈతముక్కల మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఒంగోలు నగరంలో అగ్రహారం గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ నిర్మాణాలకు స్థల సేకరణ, రైల్వేస్టేషన్‌కు తూర్పు వైపున బుకింగ్ కౌంటర్, తదితర సమస్యలెన్నో ఉన్నాయి. వాటన్నింటిపై అసెంబ్లీలో చర్చించి నిధులు రాబట్టి సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రోత్సాహకాల వలన పరిశ్రమలకు మంచిరోజులు

గ్రానైట్ ఫ్యాక్టరీలు, ఇతర ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహకాలు అందిస్తే నష్టాల్లో ఉన్న ఫ్యాక్టరీలు కోలుకుంటాయి. దాని వలన ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఉత్పత్తులు పెరుగుతాయి.

చల్లా రవి, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని

17 వేల ఎకరాల ఆయకట్టుకు మేలు



కారుమంచి మేజర్ కాలువను పునర్నిర్మిస్తే చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని 18 పంచాయతీల పరిధిలో సుమారు 17 వేల ఎకరాల ఆయకట్టుకు సాగర్ జలాలిచ్చే అవకాశం ఉంది. దాని వలన ఆయా కాలువ పరిధిలో సాగునీటితో పాటు చెరువులకు తాగునీరు కూడా ఇవ్వవచ్చు. అధికారులు, ప్రభుత్వం స్పందించి సత్వరమే కారుమంచి మేజర్‌ను పునర్నిర్మించాలి.

పమిడి వెంకట్రావు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి

సంతనూతలపాడు అభివృద్ధిపై ఆశలు...



- స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో చర్చిస్తారని ఎదురుచూపులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంతనూతలపాడు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో ఆ పార్టీల నాయకులు హామీలిచ్చారు. ఆ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన బీఎన్ విజయకుమార్ ఎన్నికవడం, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవడంతో నియోజకవర్గ అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించి నిధులు రాబట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

చీమకుర్తి మీదుగా ఫోర్‌లైన్ కోసం...

ఒంగోలు నుంచి మర్రిచెట్లపాలెం వరకు గ్రానైట్ వాహనాలు, ప్రయాణికుల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉండటం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఒంగోలు బైపాస్ నుంచి సంతనూతలపాడుకు సమీపంలోని ట్రిపుల్ ఐటీ కాలేజీ వద్ద గల మహిళా ప్రాంగణం వరకు దాదాపు 9 కి.మీ పొడవున కర్నూలు రోడ్డును ఫోర్‌లైన్‌గా మార్చారు. ట్రిపుల్ ఐటీ కాలేజీ నుంచి చీమకుర్తి మీదుగా మర్రిచెట్లపాలెం వరకు మరో 25 కి.మీ పొడవు ఉంటుంది. దాని కోసం రూ.30 కోట్ల వరకు కేటాయిస్తే ఫోర్ లైన్ ఏర్పాటు కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ నిధులు రాబట్టి రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలను నివారించడమే కాకుండా రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

కారుమంచి మేజర్ కాలువ కట్ట పునర్నిర్మించాలని డిమాండ్...

కర్నూలు రోడ్డు నుంచి గోనుగుంట, కేవీ పాలెం మీదుగా దాదాపు 18 గ్రామాలకు సాగునీరు, తాగునీరు సరఫరా చేసే కారుమంచి మేజర్ కాలువ కట్ట మధుకాన్ గ్రానైట్ క్వారీలో విరిగి పడిన సంగతి తెలిసిందే. దాని వలన రామతీర్థం రిజర్వాయర్ నుంచి 18 గ్రామాల ప్రజలకు సాగర్ నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాని పునర్నిర్మాణం చేపట్టాలని రైతు సంఘ నాయకులు, రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రామతీర్థం రిజర్వాయర్‌లో పూడిక తీయాలి...

70 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ఒంగోలుతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన రామతీర్థం రిజర్వాయర్ 20 శాతం పూడిపోయినట్లు అంచనా. దాని పూర్తి సామర్థ్యం 15.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం పూర్తిగా నింపినప్పటికీ 1.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంటుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దానికి సుమారు రూ.4 కోట్లు ఖర్చుపెట్టి పూడిక తీయిస్తే మరో అర టీఎంసీ నీరు నిల్వ ఉంటుంది. చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు, టంగుటూరు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది.

గుండ్లకమ్మ ఎడమ కాలువను పొడిగించాలి...

మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలు ఉన్నాయి. వాటిలో ఎడమ కాలువను నాగులుప్పలపాడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని శివారు ప్రాంతాలకు మరో 2 కి.మీ పొడవును పొడిగించాల్సి ఉంది. దాని కోసం రూ.4 కోట్లు కేటాయిస్తే సుమారు 1000 ఎకరాల రైతులకు సాగునీరు అంది మేలు జరుగుతుంది.

పండ్లతోటల పెంపకంపై అవగాహన అవసరం

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను వినియోగించుకోవాలి
- ఎంపీడీఓ శ్రీహరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి, పాల్గొన్న ఏపీడీ వెంకటస్వామి, తదితరులు

మద్దిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)లో భాగంగా పండ్ల తోటలకు అమలయ్యే పథకాలను సంబంధిత రైతులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి సూచించారు. సోమవారం మండలంలోని పండ్లతోటల రైతులు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు పండ్లతోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పండ్ల తోటల రైతులకు పలు పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అవి రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఆ పథకాలను వినియోగించుకుని సన్న, చిన్నకారు రైతులు లబ్ధిపొందాలని కోరారు. ఒంగోలు క్లస్టర్ ఏపీడీ వెంకటస్వామి మాట్లాడుతూ 17 రకాల పండ్లతోటల పెంపకానికి మొక్కలు అందించి ఉపాధి కూలీలతో తోటల్లో పనులు చేయించనున్నట్లు తెలిపారు. మామిడి, స్వీట్ ఆరంజ్, నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, అంజీర, పసుపు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, రోజా పూలు, మల్లెలు, మునగ, నేరేడు తోటల పెంపకానికి ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని తెలిపారు. మూడు సంవత్సరాలకు పంట చేతికి వస్తుందని చెప్పారు. ఈ మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం రైతులకు డబ్బు జమ చేస్తుందన్నారు. ఒక్కో పంటకు జమయ్యే నగదు వివరాలు వెల్లడించారు. ఎవరికైనా సందేహాలుంటే ఏపీఓను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ విస్తరణాధికారి వనజ, మద్దిపాడు ఏఈఓ శేషయ్య, ఏపీఓ ధనంజయవర్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ కిషోర్‌కుమార్, వీఏఏలు, పలువురు రైతులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: ఆషాడ పౌర్ణమి గురు వ్యాసం పూర్ణిమ సందర్భంగా స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో గల శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామి క్షేత్రంలో సోమవారం సామూహిక శ్రీ రమా వసుంధర సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశ కేశవాచార్యుల ఆధ్వర్యంలో ముందుగా ఆలయ అర్చకులు పరాంకుశ చక్రవర్తి, రంగస్వామి, సమీర్ ఉదయం పది గంటలకు 20 మంది దంపతులతో సత్యనారాయణస్వామి పూజాక్రతువులు జరిపించారు. ముందుగా గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశ పూజ, అభిషేకం నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి పూజ, సత్యనారాయణస్వామి వ్రత కథను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి సత్యనారాయణస్వామి ఆశీస్సులు అందుకున్నారు.

దివ్యాంగ బాలునికి శ్రవణ యంత్రం అందజేత


బాలుడికి శ్రవణయంత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: దివ్యాంగ బాలునికి కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో శ్రవణ యంత్రాన్ని అందజేశారు. మద్దిపాడు మండలం కీర్తిపాడుకు చెందిన మొండ్రు హరినాథ్, పద్మ దంపతుల కుమారుడు స్టీవెన్ (13) పుట్టుకతో వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. విద్యాభ్యాసానికి కూడా ఇబ్బందిగా మారిందని తల్లిదండ్రులు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన జేసీ.. వెంటనే శ్రవణ యంత్రం మంజూరు చేయాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ శాఖ ఏడీ అర్చన వెంటనే శ్రవణ యంత్రాన్ని సమకూర్చగా.. కలెక్టర్ చేతుల మీదుగా బాలుడికి అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఒంగోలు: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు సూచించారు. సోమవారం తన చాంబరులో శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో పారిశుధ్య, కాలువల్లో సిల్ట్ తొలగించే పనులు ప్రతిరోజూ చేపట్టాలన్నారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు ప్రతిరోజూ పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, మున్సిపల్ వర్కర్లు రోడ్లు శుభ్రం చేయాలని చెప్పారు. రోడ్లు శుభ్రంగా లేవని, కాలువల్లో సిల్టు తీయడంలేదని ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తే విచారించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పైపులైను లీకేజీలుంటే సంబంధిత ఏఈకి సమాచారం ఇవ్వాలని వార్డు శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. డయేరియా, డెంగీ ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కిటికీలు మూసుకోవడం, ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం వంటివాటిపై సూచనలు చేయాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన...

నగరంలోని ప్రధాన డ్రైనేజీ, మురికినీటి కాలువల్లో పూడికతీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు సోమవారం పరిశీలించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా పోతురాజు కాలువలో కలిపేందుకు తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థలో ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 18004252858 ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల సందర్భంగా సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందాలని ప్రజలకు సూచించారు.

వేద పురోహితులతో జటా పారాయణం


జటా పారాయణంలో పాల్గొన్న వేద పురోహితులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్‌లో మురళీకృష్ణ మందిరం ఎదురుగా ఆలూరు సీతారామమ్మ, రామకోటేశ్వరరావు వేదపాఠశాలలో గురు వ్యాస పూర్ణిమ సందర్భంగా ఆదివారం బ్రహ్మశ్రీ నేలంబట్ల సదాశివయ్య, ప్రముఖ వేదపురోహితుడు వత్సం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 25 మంది వేద పురోహితులతో శ్రీకృష్ణ యజుర్వేద జటా పారాయణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం జటా పారాయణం చేసిన వేద పురోహితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహంకాళి వెంకట శేషయ్య, కాలభైరవ ఉపాసకుడు మైనంపాటి సాయి, వేద పురోహితుడు వ్యామజాల ప్రసన్న దంపతులు పాల్గొని జటా పారాయణంలో పాల్గొన్న వేద పురోహితులకు పట్టువస్త్రాలు బహూకరించి ఘనంగా సన్మానించారు.

గోవింద నామస్మరణతో శ్రీగిరి గిరి ప్రదక్షిణ


శ్రీగిరి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: ఆషాడమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం అత్యంత శోభాయమానంగా స్థానిక శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీగిరి పాదపీఠం వద్ద గల బాపూజీ గోసంరక్షణ సంఘం గోశాల వద్ద నుంచి అత్యంత నయన మనోహరంగా అలంకరించిన తేరుపై స్వామివారి ప్రతిమతో గోవింద నామాలు చదువుతూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. స్థానిక గ్రంథాలయం, కేశవస్వామిపేట, భగీరథ సెంటర్, శర్మ కాలేజీ క్రికెట్ గ్రౌండ్, గద్దలగుంట మీదుగా శ్రీగిరి శ్రీనివాసుడిని దర్శించుకునేందుకు శ్రీగిరి చేరారు. శ్రీగిరి పురవీధులు స్వామివారి నామస్మరణతో మార్మోగాయి. తొలుత గో సంఘంలో గోపూజ నిర్వహించారు. శంఖు, చక్ర, తిరునామం, హనుమ గరుత్మంత చిహ్నాలను పట్టుకుని ముందు గోమాత నడవగా, మంగళ వాయిద్యాలతో గోవింద నామాలు చదువుతూ భక్తులు శ్రీగిరి గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. శ్రీగిరిపై కొలువై ఉన్న శ్రీవారిని దర్శించుకుని పరవశులయ్యారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం మాట్లాడుతూ గత సంవత్సరం శ్రావణమాసంలో ప్రారంభించిన అద్వితీయమైన ఆధ్యాత్మిక కార్యక్రమం శ్రీగిరి గిరి ప్రదక్షిణ ఈ ఆషాడమాసంతో భక్తుల పూర్తి సహకారంతో సంవత్సరం పూర్తి చేసుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ కమిటీ కోశాధికారి వలేటి కృష్ణారావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, చలువాది బ్రహ్మయ్య, ధనిశెట్టి రామనాయుడు, నల్లమల్లి కోటిసూర్యనారాయణ, పౌర్ణమి తిథి గిరిప్రదక్షిణ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి రాఘవ రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మార్గం మధ్యలో భగీరథ మహర్షి మందిరం వద్ద గిరి ప్రదక్షిణ భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

జలజీవన్ అధికారుల సందర్శన


కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని పలు గ్రామాలను జలజీవన్ మిషన్ అధికారులు సోమవారం సందర్శించారు. అనంతరం కరవది జెడ్పీ హైస్కూల్లో సర్పంచ్ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. తాగునీటి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి వివరాలు సేకరించారు. గ్రామీణ నీటి సరఫరా, వర్షాలు, భారీ వర్షాలు, నీటి కలుషితంపై ఆరా తీశారు. డయేరియా అరికట్టే విధానం గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రవి, బి.కేశవరావు, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, హెచ్‌ఎం రవికుమార్, ఇంజినీర్ మణికంఠ పాల్గొన్నారు.